



బదిలీ తప్పదని.. బరితెగింపు..!



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ధర్మవరం మున్సిపాలిటీలో అవినీతి కంపు
ప్రభుత్వం మారినా వైసీపీ సేవలోనే పలువురు అధికారులు
బదిలీ తప్పదని అక్రమార్జనకు తెరలేపిన వైనం
ప్రతి పనికీ రేటు కట్టి వసూళ్లు

ధర్మవరం, జూలై 15: గత వైసీపీ పాలన ఐదేళ్లూ ఆ పార్టీ నాయకులతో పలువురు మున్సిపల్ అధికారులు అంటకాగారు. వారికి అన్నివిధాలా సహకరిస్తూ.. తామూ జేబులు నింపుకున్నారు. నిబంధనలను గాలికొదిలేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇటీవలి ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అయినా.. వైసీపీ నాయకులతో అంటకాగిన అవినీతి అధికారుల్లో మార్పు లేదు. అదే పంథా కొనసాగిస్తున్నారు. ఆ పార్టీ నాయకుల అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో తమపై చర్యలు తప్పవని ఆ అవినీతి అధికారులు నిర్ణయానికొచ్చారు. బదిలీ తప్పదని తెలిసి మరింత రెచ్చిపోతున్నారు. ఎలాగూ బదిలీపై వెళ్లబోతున్నామనీ, చివర్లో అందినకాడికి దోచుకెళ్తే పోలా.. అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో ఏ పని చేయాలన్నా.. రేటు పెట్టి మరీ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎవరిస్థాయిలో వారు అందినకాడికి దండుకుంటున్నారు. పైసలివ్వకుంటే కొర్రీలు పెడుతూ పనులను నిర్దాక్షిణంగా నిలిపివేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో అధికాదాయం తెచ్చిపెట్టే పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది.



అక్రమార్జనే ధ్యేయంగా..

పట్టణంలోని బస్టాండు సమీపాన ఓ వైసీపీ నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌తో పాటు అదనంగా మరో అంతస్తులో పెంట్‌హౌస్ నిర్మించాడు. దీనిపై టీడీపీ నాయకులు.. మున్సిపాలిటీలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో వైసీపీ నాయకుడు యథేచ్ఛగా నిర్మాణం చేపడుతున్నాడు. నిలదీస్తే తూతూమంత్రపు తనిఖీలతో పనులు నిలిపేస్తున్నారు. తరువాత ఉన్నతాధికారులే స్వయంగా ఆ భవన యజమాని వద్దకెళ్లి టీడీపీ నాయకులకు కనబడకుండా చుట్టూ తెరవేసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచిస్తున్నారని సమాచారం. దీనిని బట్టి చూస్తే ఆ యజమాని, అధికారుల మధ్య ఏస్థాయిలో లోపాయికారీ ఒప్పందం కుదిరిందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ వైసీపీ సేవలో ఆ అధికారులు తరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు మున్సిపాలిటీలో చర్చ సాగుతోంది. లక్ష్మీచెన్నకేశవపురంలో ఓ వైసీపీ నాయకుడు మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. ఆ నాయకుడు ఇంటినే కాకుండా మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలంలో భారీఎత్తున వ్యాపార సముదాయ గదులను నిర్మించాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే.. ఆ నాయకుడు చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వైసీపీ నాయకులతో అంటకాగిన ఆ అధికారులు ఇప్పటికీ చర్యలు తీసుకోకపోగా.. అక్రమ నిర్మాణానికి లోలోపల సహకరిస్తూ భారీఎత్తున మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ధర్మవరం మున్సిపాలిటీలో ఉన్నతస్థాయి నుంచి కిందిస్థాయి వరకు వైసీపీతో అంటకాగిన అధికారులు, సిబ్బందే రాజ్యమేలుతున్నారు. ప్రభుత్వం మారినా వారిలో మాత్రం మార్పు కనిపించకపోగా.. వైసీపీ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూనే ఉన్నారు. మున్సిపాలిటీలోని అన్ని శాఖలపై ఇద్దరు అధికారులకు అజమాయిషీ ఉండటంతో వారి అవినీతి జోరుగా సాగుతోందన్న విమర్శలున్నాయి. ఇలా ప్రభుత్వం మారిన తరువాతే కోట్లాది రూపాయలు ప్రజల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో వారికి మామూళ్లు ఇచ్చుకోవడం తప్పనిసరి అయింది.

విచారించి చర్యలు తీసుకుంటాం

ధర్మవరం మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద భవనాలు నిర్మిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే బృందాలను పంపి, విచారించి చర్యలు తీసుకుంటాం.

సంజీవన్‌కుమార్, ఉమ్మడి జిల్లా పీడీ, టౌన్‌ప్లానింగ్

మామూలు ఇవ్వనిదే.. ఫైలు కదలదు..

వైసీపీతో అంటకాగిన తమకు బదిలీలు తప్పవని కొందరు అధికారులు, సిబ్బంది నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎలాగో బదిలీపై వెళ్లక తప్పదనీ, ఈలోగా అందినకాడికి దోచుకుంటే పోలా అని భావిస్తున్నారు. దీంతో అక్రమార్జన కోసం బరితెగిస్తున్నారు. ఏ చిన్నపనికి వెళ్లినా మామూలు ఇవ్వందే ఫైలు కదిలే పరిస్థితి కనిపించట్లేదు. నెలాఖరులోగా బదిలీలు తప్పవని తెలిసి అక్రమార్జన కోసం వెంపర్లాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అవినీతి అధికారులు ఇంటి పట్టాల మాటున భారీ మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం.



ధర్మవరంలో నిర్మిస్తున్న భవనం

అధికారి నుంచి కిందిస్థాయి వరకు...

ధర్మవరం మున్సిపాలిటీ అంటేనే అవినీతి కంపే కదా అనే పరిస్థితి ఇక్కడి ప్రజల్లో నెలకొంది. మున్సిపాలిటీలోని ప్రతి విభాగంలో అక్రమార్జనే పరమావధిగా మారిందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ రేటు పెట్టి వసూలు చేయడం రివాజుగా మారింది. అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా కిందిస్థాయి సిబ్బందిని పురమాయించి భారీగా వసూలు చేసుకుంటున్నట్లు సమాచారం. అధికారులు చెప్పినట్లు వినకపోతే తమను ఎక్కడ ఇబ్బంది పెడతారోనన్న ఆందోళనతో సిబ్బంది.. వారి అవినీతిలో పాలుపంచుకుంటూ వచ్చే సొమ్ములో కొంత నొక్కేసున్నట్లు తెలుస్తోంది.

తెరకట్టుకుని నిర్మాణాలు చేపట్టండి

ప్రస్తుతం అధికారం మారింది. కూటమిలోని నాయకులు తనపై ఒత్తిడి తెస్తున్నారనీ, నిర్మాణాలన్నీ నిబంధనలకు విరుద్ధమని వారికి తెలిసిపోయింది. ఇప్పటికైనా నిర్మాణం చుట్టూ వారికి కనిపించకుండా తెరకట్టుకుని పనులు చేసుకోవాలని అక్రమ నిర్మాణదారులకు ఉన్నతాధికారి ఒకరు సూచించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన ఓ అధికారి, అనంతపురం నుంచి వచ్చిన మరొకరు వైసీపీ సేవలో తరిస్తున్నారు. ఓ వైసీపీ నాయకుడి సమీప బంధువైన ద్వితీయశ్రేణి అధికారి కనుసన్నల్లోనే మున్సిపాలిటీ పాలన సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



లక్ష్మీచెన్నకేశవపురంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

కలెక్టరేట్‌కు 265 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

పుట్టపర్తి, జూలై 15: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల పరిష్కార వేదికలో 265 మంది వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. దీర్ఘకాలికంగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఎదుట వాపోయారు.

● సోమందేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ ఐదు సంవత్సరాలుగా పింఛన్‌రాలేదని వేలిముద్రలు పడలేదని పింఛన్ నిలిపివేశారని విలపించింది. వేళ్ళు వంకరలు తిరిగిపోయాయని తన గోడు ఎవరూ పట్టించుకోలేదన్నారు.

● కదిరికి చెందిన రమేష్ మరికొంతమంది దివ్యాంగులు అంగవైకల్య శాతాన్ని బట్టి పింఛన్ మంజూరు చేయాలని విన్నవించారు.

● ముదిగుబ్బ మండలానికి చెందిన రైతులు.. 1954కు ముందున్న పట్టా భూములను చుక్కల భూముల జాబితా నుంచి తొలగించాలని ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను కోరారు.

● సార్వత్రిక ఎన్నికల్లో వీడియోలు, ఫొటోలు తీశామనీ, వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించలేదంటూ ధర్మవరానికి చెందిన రామ్మోహన్, హరి, రామ్మోహన్‌నాయుడు, మరికొందరు.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

డీపీఓలో 18 అర్జీలు

పుట్టపర్తి రూరల్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 18 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ వాటిని స్వీకరించారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ శ్రీహర్ష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి పీహెచ్‌సీకి గుర్తింపు



పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు, సిబ్బంది సంబరాలు

తాడిమర్రి, జూలై 15: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్‌సీ)కి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించింది. జాతీయ క్వాలిటీ సర్టిఫికేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో తాడిమర్రి పీహెచ్‌సీ ఏకంగా 84 పాయింట్లతో రాష్ట్రంలోనే మెరుగైన ప్రభుత్వ వైద్యశాలల జాబితాలో ఏడో స్థానం దక్కించుకుంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీవాత్సవ ఈనెల 15న తాడిమర్రి సర్టిఫికెట్ పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, వైద్య పరికరాల నాణ్యత, సర్జరీలు చేయడంలో నైపుణ్యత, మందుల పంపిణీ, వైద్యసేవల తీరుపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే చేపట్టింది. అందులో తాడిమర్రి పీహెచ్‌సీని ఎంపిక చేసింది. పీహెచ్‌సీకి సర్టిఫికెట్ అందిన నేపథ్యంలో సంబరాలు చేసుకున్నారు. జిల్లా ఉప వైద్యాధికారి సెల్వియా సాల్మన్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. స్థానిక వైద్యులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరిత, గోవర్ధన్‌నాయుడు, కంటి వైద్యనిపుణుడు ఉరుకుందప్ప, సీహెచ్‌ఓ హేమలత, సూపర్‌వైజర్ రాంకుమార్ పాల్గొన్నారు.

మహిళ మృతిపై విచారణ



ఆర్ఎంపీని విచారిస్తున్న ఆర్డీఓ

తనకల్లు, జూలై 15: ఆర్ఎంపీ వైద్యం వికటించి, మండలంలోని కొక్కంటి గ్రామానికి చెందిన ఉత్తమ్మ మరణించడంపై అధికారులు విచారణ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ వంశీకృష్ణ.. ఆర్ఎంపీ అబ్దుల్‌ను సోమవారం విచారించారు. అనంతరం కొక్కంటి పీహెచ్‌సీ వైద్యులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజును పిలిపించి విచారించారు. ఘటనపై ఆరాతీశారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ ఉన్నారు.

ఆస్పత్రి తనిఖీ: మండలకేంద్రంలోని సీహెచ్‌సీని ఆర్డీఓ వంశీకృష్ణ తనిఖీ చేశారు. ఎంతమంది డాక్టర్లున్నారు తదితర వివరాలు ఆరాతీశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పకుండా డాక్టర్లందరూ అందుబాటులు ఉండాలని ఆదేశించారు. నెలలో రెండుమార్లు తప్పకుండా మండలంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను తనిఖీ చేయాలని అక్కడే ఉన్న తహసీల్దార్ శోభాసువర్ణమ్మను ఆదేశించారు.

వైసీపీ వర్గీయుల దాష్టీకం

కేసు పెట్టారని
వేటకొడవలితో టీడీపీ నాయకులపై దాడి



దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు బాలచంద్ర, కిష్టయ్య

ధర్మవరం రూరల్, జూలై 15: వైసీపీ వర్గీయులు గూండాగిరీకి దిగారు. తమపై గతంలో కేసు పెట్టారన్న అక్కసుతో ఏకంగా వేటకొడవలితో టీడీపీ నాయకులపై దాడికి తెగబడ్డారు. మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కిష్టయ్య, మామిళ్లపల్లి బాలచంద్రపై అదే ఊరికి చెందిన వైసీపీ వర్గీయులు సోమవారం వేటకొడవళ్లతో దాడి చేశారు. గతంలో తమపై కేసు పెట్టారన్న అక్కసుతో ఈ దారుణానికి ఒడిగట్టారని బాధితులు తెలిపారు. వారు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కిష్టయ్య తోటలోని చీనీ చెట్లను వైసీపీ నాయకులు బోగే లక్ష్మీరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డి, నరేష్‌రెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి గతంలో నరికేయడంతో కేసు పెట్టాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కిష్టయ్యతో పొలంలో వైసీపీ నాయకులు గొడవకు దిగారు. అక్కడే పొలంలో గొర్రెలు మేపుకుంటున్న కిష్టయ్య అన్న కుమారుడైన మామిళ్లపల్లి బాలచంద్ర వారి వద్దకెళ్లాడు. గొడవను ఆపేందుకు ప్రయత్నిస్తుండగా రామకృష్ణారెడ్డి కొడవలితో వెనుకవైపు నుంచి బాలచంద్ర తలపై దాడి చేశాడు. దీంతో బాలచంద్ర తలలో తీవ్ర రక్తస్రావమైంది. దాడిలో కిష్టయ్యకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు.. ఇరువురిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిపై ధర్మవరం రూరల్ పోలీసులకు బాధితుడు బాలచంద్ర ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. కాగా తమ పొలానికి విద్యుత్ సరఫరా విషయంలో తమపైనే టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గీయులు నరేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తేలికపాటి వర్షం

పుట్టపర్తి రూరల్, జూలై 15: జిల్లాలో పలు చోట్ల ఆదివారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారు ప్రకటనలో పేర్కొన్నారు. ముదిగుబ్బ, రొళ్ల 5.4, చిలమత్తూరు 5.2, అగళి 4.0, కదిరి 3.2, మడకశిర 3.2, నల్లచెరువు 3.0, అమరాపురం 2.8, ధర్మవరం, తాడిమర్రి, తలుపుల, రామగిరి, పెనుకొండ 2.4, రొద్దం 2.2, కొత్తచెరువు 2.0, హిందూపురం 1.8, చెన్నేకొత్తపల్లి 1.4, బత్తలపల్లి, తనకల్లులో 1.2 వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలియజేశారు.

అధ్యాపకులతో ఆటలు..!

రెగ్యులర్ చేస్తామంటూ మాజీ సీఎం జగన్ హామీ
ఉత్తర్వులు జారీ
అమలు చేయకుండా ఎన్నికల ముందు కాలయాపన
రెన్యువల్ కూడా చేయని వైనం
అయోమయంలో అధ్యాపకులు
మూడునెలలుగా వేతనాలు అందక వెతలు



కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు, జూలై 15: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను మాజీ ముఖ్యమంత్రి జగన్ నిండాముంచాడు. గత వైసీపీ హయాంలో రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి, అమలు చేయలేదు. ఎన్నికల ముందు కాలయాపన చేశాడు. రెగ్యులర్ చేస్తామని చెప్పి.. కనీసం రెన్యువల్ కూడా చేయలేదు. రెన్యువల్ గడువు కూడా ముగిసింది. దీంతో వారికి మూడు నెలలుగా జీతాలు కూడా అందక అవస్థలు పడుతున్నారు. జగన్ పుణ్యమాని కాంట్రాక్టు అధ్యాపకులు రోడ్డున పడ్డారు. రెగ్యులర్ చేయక, రెన్యువల్ కాక, వేతనాలు అందక వారి పరిస్థితి దయనీయంగా మారింది.

అగమ్యగోచరం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దాదాపు 380 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారు. చాలా కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకులే దిక్కు. వారిని రెగ్యులర్ చేస్తామని సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి సీఎం జగన్ హామీ ఇచ్చారు. అమలు చేస్తామంటూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. కాలయాపన చేస్తూ వచ్చారు. మాట తప్పాడు. ఇదే కాంట్రాక్టు అధ్యాపకులకు ఇబ్బందిగా మారింది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వెంటనే డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జూనియర్ కళాశాల అధ్యాపకులను రెగ్యులర్ చేయనున్నట్లు గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో రెన్యువల్ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రెన్యువల్‌కు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కాంట్రాక్టు అధ్యాపకులు అయోమయంలో పడ్డారు. ఎప్పుడు రెన్యువల్ చేస్తారో, జీతాలు ఎప్పుడు వస్తాయోనని ఆశగా చూస్తున్నారు.

గత టీడీపీ హయాంలోనే మేళ్లు

గత టీడీపీ ప్రభుత్వం 2019లో కాంట్రాక్టు అధ్యాపకులకు మినిమం టైంస్కేల్‌ను అమలుచేసింది. ఇందులో భాగంగా ఏటా పదిరోజుల విరామంతో పన్నెండు నెలల జీతం ఇచ్చేలా జీఓ జారీచేసింది. అదే విధానాన్ని తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కొనసాగించాయి. కాంట్రాక్టు అధ్యాపకులు పోరాటం చేయడంతో 12 నెలల జీతం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రెగ్యులర్ చేస్తామని చెప్పి జగన్ మోసం

2014కి ముందు కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారందరినీ తాను అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తానని మాజీ సీఎం జగన్ హామీ ఇచ్చాడు. రెన్యువల్ కూడా చేయకుండా జగన్ మోసం చేశాడని కాంట్రాక్టు అధ్యాపకులు మండి పడుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఏప్రిల్ 30వ తేదీలోగా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం మే, జూన్ నెలల్లో కూడా పనిచేసేలా ఆదేశాలిచ్చింది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు వారితో పాఠాలు చెప్పించడంతోపాటు ప్రశ్నపత్రాల మూల్యాంకనం చేయించింది. తిరిగి కళాశాలలు ప్రారంభమవుతుండటంతో అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులను కళాశాలల్లో చేర్పించేలా కార్యక్రమాలను అమలుచేసింది. దీంతో వారు మే నెల నుంచి పని చేస్తున్నా నేటికీ రెన్యువల్ ఉత్తర్వులు రాలేదు. రెన్యువల్ కాకపోతే తమకు జీతాలు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రెన్యువల్‌కు ఆదేశాలు జారీ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు వేడుకుంటున్నారు. లేకపోతే గతప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ ఇచ్చిన జీఓను అమలు చేయాలని కోరుతున్నారు.

రెన్యువల్ చేసి.. వెంటనే వేతనాలివ్వాలి

జూనియర్ కళాశాలల అధ్యాపకుల కాంట్రాక్టు రెన్యువల్ చేయకపోవడంతో జీతాలు కూడా అందక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రెన్యువల్ చేసి, వెంటనే వేతనాల్చి ఆదుకోవాలి.

- ఎర్రెప్ప, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం డిగ్రీ, డిప్లొమా కాలేజీల అధ్యాపకుల రెన్యువల్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూనియర్ కళాశాలల వారికి కూడా త్వరలోనే అవకాశం కల్పిస్తుంది.

- రఘునాథరెడ్డి, డీఐఈఓ

టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీటి నిల్వ



బొమ్మనహాళ్, జూలై 15: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సోమవారానికి 33.07 టీఎంసీలకు పెరిగింది. ఇన్‌ఫ్లో 16,142 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 211 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తుంగభద్రకు చేరాల్సిన వరదనీరు ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత వారం వచ్చిన వరదనీరు ప్రస్తుతం తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

టమోటా కిలో రూ.48



అనంతపురం రూరల్, జూలై 15: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 150 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.25 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురం రూరల్, జూలై 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 723 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇంకేం భయం లేదు !

- పేదింటి బిడ్డల చదువు బాధ్యత తీసుకున్న ప్రభుత్వం
- నేరుగా కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్
- విద్యార్థులకు తప్పనున్న ఫీజుల భారం
- రాబోయే ఫలాలకు ఇది పెట్టుబడి: నిపుణులు
- నాణ్యమైన విద్యనందించడమే కళాశాలల పని

అనంతపురం సెంట్రల్, జూలై 13: ఆర్థిక సమస్యలతో పేదింటి బిడ్డల పెద్ద చదువులు ఆగిపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం తపిస్తోంది. అందుకే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు చెల్లించే బాధ్యత తీసుకుంది. ఈఏపీసెట్ ద్వారా 2024-25 విద్యా సంవత్సరం బీటెక్‌లో కన్వీనర్ కోటా ద్వారా 40891 సీట్లలో చేరబోయే పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లించనుంది. ఇందుకోసం రూ.206 కోట్లను కూటమి ప్రభుత్వం ఖర్చు చేయనుంది. వీటితోపాటు ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం విద్యార్థులకు దాదాపు రూ.400 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంటే ఒక్క ఏడాదికి బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్థులపై రూ.600కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. కాగా ఈఏపీసెట్‌లో అర్హత సాధించని వారు, కన్వీనర్ కోటాలో సరైన ర్యాంకు రాక కోరుకున్న కళాశాలలో చదవాలనుకున్న వారు మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్ తీసుకుంటారు.

మేనేజ్‌మెంట్ కోటాలో ఫీజుల మోత

జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా నాలుగు కానిస్టిట్యూయేట్, 67 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. ఎస్కేయూ క్యాంపస్, బెస్ట్ యూనివర్సిటీ, ఆచార్య ఎన్‌జీ రంగ అగ్రికల్చర్ అనుబంధంగా కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజ్ (మడకశిర) మొత్తం 74 కళాశాలలున్నాయి. వీటిలో 40891 సీట్లను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కన్వీనర్ కోటా కింద కేటాయించింది. కళాశాల వారిగా ఫీజుల మొత్తాన్ని నిర్ధారించింది. ప్రైవేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద 30శాతం సీట్లు ఉంటాయి. కన్వీనర్ కోటా ఫీజు మొత్తానికి మూడు రెట్లు అధికంగా మేనేజ్‌మెంట్ కోటాలో వసూలు చేసుకునే అవకాశాన్ని ప్రైవేట్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.

కళాశాలలదే బాధ్యత

ప్రతి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటాకింద చేరిన పేదల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. కోర్సులకు అనుగుణంగా ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర వాటిలో మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యనందించే బాధ్యత కళాశాలలదే. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలు పడిపోయాయి. రాజకీయ పలుకుబడితో కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల మొత్తాలను అధికంగా పెంచుకున్నారు. వీటితోపాటు బిల్డింగ్, ట్రైనింగ్, స్కిల్స్ ఇలా అనేక రకాలుగా అదనంగా విద్యార్థులతో దండుకున్నారు. అయినా నాణ్యమైన విద్యనందించకపోవడంతో డిగ్రీలు పొందిన విద్యార్థులు ఉద్యోగాలు లభించక నిరుద్యోగులకు ఉంటున్నారని వారి తల్లిదండ్రులు మండిపడుతున్నారు.



జేఎన్‌టీయూ

మెరుగైన అవకాశాలే నిదర్శనం



విద్యాభ్యాసం ముగిసిన అనంతరం విద్యార్థులు అందుకునే మెరుగైన అవకాశాలే రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడికి నిదర్శనం. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల రూపంలో ప్రతి పేద విద్యార్థికి సొమ్ము చెల్లించేలా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రచించుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బంది పెట్టింది.

- కుమ్మతి బాలకృష్ణ, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు.

ఆశలు చిగురించాయి



కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఫీజుల సమస్యలన్నీ తీరుతాయన్న ఆశలు విద్యార్థుల్లో చిగురించాయి. ఈ ప్రాంతంలోని జేఎన్‌టీయూ, ఎస్కేయూ తదితర విద్యాసంస్థల పరిధిలో దాదాపు 40వేలమంది విద్యార్థులు బీటెక్‌లో కన్వీనర్ కోటాకింద చేరబోతున్నారు.

- తరిమెల గిరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు.

కాళ్లరిగేలా తిప్పారు



విద్యాదీవెనకోసం కాళ్లరిగిలా తిప్పారు. సచివాలయానికి వెళ్తే బ్యాంక్‌లో చెక్ చేయమన్నారు. అక్కడికెళ్తే పోస్టాఫీస్ కెళ్లమన్నారు. ఇలా అన్నింటి చుట్టూ తిరగాల్సి వచ్చింది. అయినా రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. దీంతో కళాశాలకు సొంతంగా ఫీజు కట్టా. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నేరుగా కళాశాలకే ఫీజుకట్టేలా చర్యలు తీసుకోవాలి.

- భాను ప్రకాష్, బీటెక్ నాలుగో సంవత్సరం

గొప్పలకు పోయారు



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వారే కొత్తగా ఇస్తున్నట్లు గత ప్రభుత్వంలో గొప్పలకు పోయారు. జేవీడీ పేరుతో విద్యార్థి, విద్యార్థి తల్లికి జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయించారు. దరఖాస్తుకు ఒకసారి, విడుదల చేసిన తరువాత మరోసారి సచివాలయంలో వేలిముద్రలు వేయించుకున్నారు. అయినా పూర్తిగా ఫీజు ఇవ్వలేదు.

-బాలశివ, బీటెక్ చివరి సంవత్సరం

కళాశాలలకే చెల్లించాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను కళాశాలలకే నేరుగా చెల్లించి విద్యార్థులకు ఫీజు బాధలు తప్పించాలి. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై పెట్టుబడిగా పెట్టిన సొమ్ముకు సార్థకత ఉంటుంది. ఫీజులు కట్టాలన ఆలోచన లేకుండా చదువుపై శ్రద్ధపెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చు కోవడానికి అవకాశం ఉంటుంది.

- చంద్ర, బీటెక్ ఫైనల్ ఇయర్

హర్షణీయం



కళాశాలకు ఫీజు బకాయి ఉన్నామన్న భయం విద్యార్థుల్లో తొలగించి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం శుభ పరిణామం. ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతిపైసా ఒక పెట్టుబడే. దీని ఫలాలు విద్యార్థులు ప్రయోజకులుగా మారి చేసే సేవలో సమాజానికి అందుతాయి. ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం హర్షణీయం

-క్రిష్ణయ్య, ప్రొఫెసర్, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు తొడిగిన కలెక్టర్



దివ్యాంగుడికి కృత్రిమ కాలును తొడిగిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 15: దివ్యాంగుల పట్ల కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ మానవత్వం చాటుకున్నారు. కాళ్లులేని పుట్లూరు మండలం కందిగోపుల గ్రామానికి చెందిన రామయ్య, ఆత్మకూరు మండలం బీ.యాలేరుకు చెందిన ఓబులమ్మ, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన భాగ్యమ్మలకు ప్రభుత్వం నుంచి కృత్రిమ కాళ్లు మంజూరయ్యాయి. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జరుగుతున్న మీకోసం కార్యక్రమంలో ఈకృత్రిమ కాళ్లను ఆ ముగ్గురికి అందజేశారు. కలెక్టరు వినోద్ కుమార్ నేరుగా దివ్యాంగుల వద్దకు వచ్చి స్వయంగా ఆ కృత్రిమ కాళ్లు తొడిగించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ దివ్యాంగుల విషయంలో ఎవరు ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కృత్రిమకాళ్లు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకల్లో ప్రమాదం



అగ్నిగుండంలో పడి గాయపడిన లక్ష్మీనారాయణ

విడపనకల్లు, జూలై 15: మండలంలోని పొలికి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున మొహరం వేడుకల్లో పాల్గొన్న ఓ వ్యక్తి గాయపడ్డాడు. గ్రామంలోని పీర్లకు సోమవారం తెల్లవారు జామున అగ్ని గుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పీరు ఎత్తుకుని అగ్ని గుండంలోకి దిగాడు. బయటకు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గుండంలో పడిపోయాడు. గ్రామస్థులు వెంటనే ఆయన్ను బయటకు తీశారు. అప్పటికే కాళ్లు, చేతులు కాలి గాయాలు తీవ్రంగా అయ్యాయి. బాధితుడిని వెంటనే ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

డిగ్రీలో 77శాతం మంది పాస్

అనంతపురం సెంట్రల్, జూలై 15: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో 77శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. పరీక్షల నిర్వహణ విభాగాధిపతి జీవీ రమణ ఆధ్వర్యంలో రెక్టార్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ లక్ష్మయ్య సోమవారం ఫలితాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ డిగ్రీ బీఏ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ విదార్థులకు ఏప్రిల్‌లో ఆరో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 10906 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8468మంది పాస్ అయ్యారని తెలిపారు. దీంతో పాస్ శాతం 77.65గా నమోదైనట్లు పేర్కొన్నారు.

నేడు గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు



అలంకరణలో ఆంజనేయస్వామి



కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, జూలై 15: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు మంగళవారం జరగనున్నట్లు ఆలయ ఈఓ శోభా తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కుళ్లాయిస్వామికి విడిది కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. భారీగా భక్తులు హాజరయ్యే పెద్దసరిగెత్తు కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 17న జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కన్నుల పండువగా ఖాసీంస్వామి గ్రామోత్సవం



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న ఖాసీంస్వామి

బత్తలపల్లి, జూలై 15: మండలకేంద్రంలో ఖాసీం స్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ ఉత్సవాలకు గూగుడు తర్వాత అంతటి ప్రాధాన్యం ఉంది. ఖాసీం స్వామిని సోమవారం రకరకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. తప్పెట్లు, మేళాల మధ్య స్వామివారిని తెల్లవారుజామున 5గంటలకు గుడి నుంచి బయటకు తెచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు ఖాసీంస్వామి నామ స్మరణతో మార్మోగాయి. గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పినపెద్ద జక్కంపూటి వెంకటేశు సమాధి వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు వచ్చి ఖాసీం స్వామితో భేటీ తీసుకున్నాయి. కార్యక్రమములో జక్కంపూటీ సత్యనారాయణ. తిరుపాలు, పురుషోత్తమచౌదరి, సుబ్బరాయుడు, జయప్ప, గోపాల్, అశోక్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాసీం స్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పానకదుత్తలు స్వామి వారికి సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

15 మండలాల్లో వర్షం



అనంతపురం నగరంలో వానలో వాహనదారులు

అనంతపురం అర్బన్, జూలై 15: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. అనంతపురం, యాడికి, శింగనమల, పామిడి, బెళుగుప్ప, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, గార్లదిన్నె, పుట్లూరు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 15 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం పడింది. కళ్యాణదుర్గంలో 7.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 5.2, బొమ్మనహాళ్, గుంతకల్లులో 4.4, డీ.హీరేహాళ్, యాడికి, తాడిపత్రిలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 3.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

నేడు లేపాక్షికి షిప్పింగ్ చైర్మన్

లేపాక్షి, జూలై 15: కేంద్ర అంతర్గత జల(షిప్పింగ్) చైర్మన్ విజయ్‌కుమార్ మంగళవారం లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు ఆయన ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

న్యాయాధికారిని నియమించండి

హైకోర్టు జడ్జికి బార్ అసోసియేషన్ సభ్యుల వినతి



హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

తాడిపత్రి, జూలై 15: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డిని బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సభ్యులు పుష్పగుచ్ఛం అందించారు. స్థానిక కోర్టులో న్యాయాధికారి స్థానం ఖాళీగా ఉందని, దీంతో కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలోనే దాదాపు ఏడు వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వెంటనే న్యాయాధికారిని నియమించాలని వినతిపత్రం అందజేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి తెలిపారు. దీనిపై విజయవాడ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిని కలవాలని జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి వారికి సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సెక్రటరీ శ్రీనివాసులు, ప్రసాద్, సహదేవరెడ్డి, సూర్యనారాయణ, సాహుల్, శివ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

- సెంట్రల్ వర్సిటీ అధికారులకు ఎంపీ సూచన

అనంతపురం సెంట్రల్, జూలై 15: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన వర్సిటీని సందర్శించి అకడమిక్, అడ్మిన్‌స్ట్రేషన్ అంశాలపై చర్చించారు. ఎంపీ మాట్లాడుతూ కోర్సులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలతో కూడిన సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్సిటీకి అవసరమైన నిధులను విడుదల చేయించేలా కృషిచేస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వర్సిటీ అభివృద్ధిని విస్మరించడమే కాకుండా నిధులు రాబట్టడంలో విఫలమైందని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీని వర్సిటీ వీసీ కోరి సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు షీలారెడ్డి, ఉమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న వీసీ కోరి

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ బాధ్యతల స్వీకరణ



నూతన పీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15: డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఓబుళమ్మ బాధ్యతలు స్వీకరించారు. డీఎల్‌డీఓగా ఉన్న ఓబుళమ్మను డీఆర్‌డీఏ-వెలుగు పీడీ(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఓబుళమ్మ అనంతరం డీఆర్‌డీఏ-వెలుగు పీడీ కార్యాలయంలో ఈశ్వరయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈశ్వరయ్యతో పాటు పలువురు డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలు ఓబుళమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడం, అర్హులందరికీ పింఛన్‌లు అందజేయడం, బోగస్ పింఛన్లను ఏరివేయడంపై సమష్టిగా పనిచేయాలని సిబ్బందిని నూతన పీడీ కోరారు.

చేనేతల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

జేసీఐపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రుషింగప్ప



నినాదాలు చేస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 15: గత వైసీపీ ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని విస్మరించి వారికి ఉపాధి లేకుండా చేసిందని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ(జేసీఐపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి రుషింగప్ప మండిపడ్డారు. చేనేత సంక్షేమ పథకాలను పునఃప్రారంభించాలని సోమవారం జేసీఐపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రుషింగప్ప మాట్లాడుతూ 2014-19లో టీడీపీ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి చేనేతలను ప్రోత్సహించిందన్నారు. అయితే వైసీపీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మల్లికార్జున, సోమశేఖర్, శ్రీనివాసులు, నరసింహులు, గోపాల్, రామచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

నార్పల, జూలై 15: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు అనంతపురం డీఎస్పీ టీవీ శివారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్పలలో బాలిక పట్ల జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు నాగరాజు అసభ్యంగా ప్రవర్తించిన ఘనటపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఆదివారం జరిగిన ఘటనపై నార్పల పోలీసు స్టేషన్‌లో పోక్సో, ఎస్సీఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పునాదులు తొలగిస్తున్న అధికారులు

కదిరి, జూలై 15: మండలంలోని ముత్యాల చెరువు పొలంలో... కదిరి పట్టణ శివార్లలోని టిడ్కో ఇళ్లకు సమీపంలో ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీకి పక్కనే ఉన్న ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పునాదులు వేశారు. దాదాపు 30 సెంట్లకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. దీని విలువ దాదాపు రూ. కోటికి పైగా ఉంది. దీనిపై ఈ నెల 14 ప్రభుత్వ స్థలం ఆక్రమణ అనే శీర్షికతో ఓ కథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనికి స్పందించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెంటనే ఆ ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం ఉదయం అధికారులు జేసీబీతో ఆ పునాదులు తొలగించారు. ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

పొలాలకు దారి సమస్య పరిష్కరించండి: రైతులు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పుట్టపర్తి, జూలై 15 : తాతల కాలం నుంచి తమ పొలాలకు ఉన్న దారిని మూసివేశారని, దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని గోరంట్ల మండలం దిగువగంగంపల్లికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. రైతులు వెంకట్రాముడు, శ్రీనివాసులు, జనార్ధన వెంకటేసు, గోవిందరెడ్డి సూరి మాట్లాడుతూ.. తమ పొలాలకు వెళ్లేందుకు గ్రామంలో నుంచి బండిదారి ఉండేదన్నారు. ఈ దారి వెంట దాదాపు 50 మంది రైతులు పొలాలకు వెళ్తుంటారన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేయాల్సి ఉండగా రైతు రామకృష్ణ దారిలేదంటూ ఆ బండిదారిని మూసివేశాడని వాపోయారు. ఈ సమస్యను మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించ లేదన్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద ఇలా ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వారు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

నల్లమాడ, జూలై 15: మండలంలోని దొన్నికోటకు చెందిన బండి వీరనారాయణ కుమార్తె బండి శ్రావణి (18) కడుపు నొప్పి తాళలేక ఉరేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. శ్రావణి, గోరంట్ల గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌తో ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. పెళ్లి కాకముందు నుంచే శ్రావణి కడుపు నొప్పితో బాధపడేది. బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. ఇటీవల నొప్పి ఎక్కువైంది. ఆదివారం రాత్రి కూడా నొప్పి రావడంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం గుర్తించిన కుటుం సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



లక్ష్మీపతి (ఫైల్)

నల్లమాడ, జూలై 15: నల్లమాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మీపతి నాయక్ (56) సోమవారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు మండలంలోని కొత్తపల్లి తండాకు వెళ్లి.. అతని మృతదేహానికి నివాళులర్పించారు. లక్ష్మీపతి నాయక్ నల్లమాడ, ముదిగుబ్బ, రెడ్డిపల్లి, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల్లో విధులు నిర్వహించారు. లక్ష్మీపతికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

గుండెపోటుతో రైతు ..

ముదిగుబ్బ, జూలై 15: మండలంలోని జొన్నలకొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు నాగన్న (66) గుండెపోటుతో సోమవారం స్వగృహంలో మరణించాడు. నాగన్న స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయంలో నష్టాలు, కూతుళ్ల వివాహాలకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం గుండెపోటుకు గురై మరణించాడు.

నూతన యానిమేటర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ

ఓబుళదేవరచెరువు, జూలై 15: మండలంలోని వడ్డివారిపల్లి సమీపంలో ఐకేపీ కార్యాలయంలో నూతన యానిమేటర్లతో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పట్టా ఓబులరెడ్డి, కన్వీనర్ శెట్టివారి జయచంద్ర సోమవారం సమావేశం నిర్వహించారు. పొదుపు సంఘాల ద్వారా మహిళాల ఆర్థికాభివృద్ధి సాధించడం ఒక్క ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. మహిళలకు ప్రస్తుతం వడ్డీ లేకుండా రూ. పది లక్షలు రుణాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ముందుకొచ్చారన్నారు. సమావేశంలో వెలుగు ఏపీఎం రమణప్ప, ఎంపీటీసీ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఆర్ఎంపీ జాకీర్ అహమ్మద్, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, నిజాం, చికెన్ షానూ పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

బుక్కపట్నం, జూలై 15: వృత్తి విద్యనైపుణ్యతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పాల్ రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రపంచ నైపుణ్యాభివృద్ధి దినోత్సవాన్ని నిర్వహించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కావలసిన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంతో సిల్క్‌హబ్ జిల్లా కో-ఆర్డినేటర్ ఖయామ్, సభ్యురాలు విజయభారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోండి: ఏఓ

మడకశిర(అమరాపురం), జూలై 15: కౌలు రైతులు గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని ఏఓ తెలిపారు. అమరాపురం మండలంలోని భూమిలేని రైతులు, ఇతరుల భూమి కౌలుకు చేస్తున్నవారు ఈసేవా కేంద్రానికి వెళ్లి గుర్తింపుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన కౌలు రైతులకు ప్రభుత్వం పంటసాగు హక్కుపత్రం, సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతుకు కూడా అందుతాయన్నారు. కౌలు రైతులు ఈసేవా కేంద్రాలకు వెళ్లి భూమి యజమాని ఆధార్‌కార్డు, భూమి పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు, అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో ప్రభుత్వ ఆస్పత్రి





పెచ్చులు ఊడిన ఆస్పత్రి భవనం



నెర్రెలు చీలిన గోడ

- ఓడీసీలో పెచ్చులూడుతున్న భవనం
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- వర్షాకాలం మొదలైతే సిబ్బంది, రోగులకు గుబులు

ఓబుళదేవరచెరువు, జూలై 15: స్థానికంగా 38 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల నేడు శిథిలావస్థకు చేరుకుంది. గత ఐదేళ్లుగా నిర్వహణ సరిగా లేక మరీ హీనంగా మారింది. గత వైసీపీ పాలనలో మూడేళ్ల క్రితం నూతన భవన నిర్మాణానికి రూ.2.14 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు చేసినా.. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించదనే భయంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇలా ఐదుసార్లు టెండర్లకు పిలిచినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అప్పట్లో ఆ నిధులను వెనక్కు పంపారు. వర్షాకాలం మొదలైతే చాలు వైద్య సిబ్బంది, రోగుల్లో గుబులు మొదలవుతుంది. వైద్యశాల ప్రధాన ముఖద్వారం వద్దే భవనం పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు వైద్యశాలలో వైద్యుల గది, టెక్నికల్, మందుల నిలువ గదుల్లోనూ పెచ్చులు ఊడి కడ్డీలు కనిపిస్తున్నాయి. చాలాచోట్ల గోడలు నెర్రెలు చీలాయి. నాలుగు నెలల క్రితం రోగులు వైద్యుని గది వద్ద పరీక్షల కోసం వేచి ఉండగా.. ఒక్కసారిగా పెచ్చులు ఊడి పడటంతో రోగులు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. వర్షాకాలం మొదలైతే ఇక సిబ్బంది, రోగులు భయం భయంగా వైద్యశాలలోకి వెళ్లాల్సి వస్తోంది. ఎక్కడ పెచ్చులూడి పడతాయోననే భయంతో రోగులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. కనీసం కూటమి ప్రభుత్వం అయినా మండల ప్రజల సమస్య గుర్తించి, భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు చెప్పాం

వైద్యశాలలో నెలకున్న సమస్యలను గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మూడేళ్ల క్రితం నూతన భవనాలకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పలుమార్లు టెండర్లు రద్దు అయ్యాయి. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తాం.

\- డాక్టర్ భానుప్రకాష్‌నాయక్, వైద్యాధికారి, ఓడిచెరువు

లేడీ డాక్టర్‌ను నియమించాలి



భయం భయంగా వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోంది. నూతన భవన నిర్మాణం చేపట్టాలి. వైద్యశాలలో ఇద్దరు పురుష డాక్టర్లు ఉన్నారు. మహిళల సమస్యలు చెప్పుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. వైద్యశాలలో మహిళ డాక్టర్‌ను నియమించారు.

\- కుచ్చెపు అంజినమ్మ, నల్లగుట్లపల్లి

ఎమ్మెల్యే స్పందించాలి



శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ వైద్యశాల స్థానంలో నూతన ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ చూపాలి. నిధులు మంజూరు చేయించాలి. వర్షాకాలంలో వైద్యసిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

\- మందోజీ ఆర్షీఖాన్, ఓడీసీ

ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల తనిఖీ



నల్లమాడ, జూలై 15: స్థానిక ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను డీఈఓ మీనాక్షి సోమవారం తనిఖీ చేశారు. ఆమె వంట గది, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. వంట గదిలో కూరగాయాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగా ఉందా, స్టూడెంట్స్ కిట్లు అందాయా లేదా అని అడిగారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టెన్త్‌లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించేలా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు సతీష్, వార్డెన్ సత్యనారాయణ, సీఆర్ఎంటీ మదార్‌వలీ, ఎంఐఎస్ రఫీ, నాగరాజు ఉన్నారు.

← రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ

అర్హతలేని ఆర్ఎంపీలపై విచారణ చేపట్టండి





తనకల్లు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పారేసు, ముదిగుబ్బలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్

తనకల్లు, జూలై 15: మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హతలేని ఆర్ఎంపీలు ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని, వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని దళిత నాయకుడు పారేసు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం అందించారు. అర్హతలేనివారు, లైసెన్సులు లేకుండా ఆసుపత్రులను నిర్వహిస్తున్నా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయంపై సీపీఐ నాయకుడు రెడ్డెప్ప, కౌలు రైతు సంఘం చౌడప్ప, రైతు సంఘం కరీముల్లా, ఆనంద్ కూడా తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ముదిగుబ్బలో 50 ఫిర్యాదులు

ముదిగుబ్బ : మండల తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి మొత్తం 50 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ నాగేశాచల రెడ్డి, ఎంఈఓ రమణప్ప, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేసిన దివ్య

విద్యా సామగ్రి పంపిణీ

బుక్కపట్నం, జూలై 15: మండలంలోని నాయనవారిపల్లె తండాకు చెందిన చెన్నప్పనాయక్ కుమార్తె దివ్య విద్యార్థులకు విద్యా సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. నాయనవారిపల్లె తండా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కట్టా సుబ్రహ్మణ్యం, సుధాకర్, ఎర్రి స్వామి పాల్గొన్నారు.

దొన్నికోటలో ఉచిత వైద్యశిబిరం

నల్లమాడ, జూలై 15: మండలంలోని దొన్నికోటలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యునైటెడ్ కింగ్ డమ్‌కు చెందిన వైద్యులు ఈ శిబిరాన్ని నిర్వహించారు. 350 మంది ఈ శిబిరం ద్వారా చికిత్సలు పొందారు. ఇందులో పలు వ్యాధులకు చెందిన 25 మందిని గుర్తించి బెంగుళూరు వైట్ ఫీల్డు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రేఫర్ చేశారు. చికిత్సలు చేయించుకున్నవారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు, రోగులు, దొన్నికోట సేవాసమితి నాయకుడు జయశంకర్ నాయుడు, జయరామనాయుడు పాల్గొన్నారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి

పుట్టపర్తి, జూలై 15: జీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి నాయకులు గోపికృష్ణ రమణారెడ్డి, చిదంబరరెడ్డి నారాయణస్వామి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. డీఎస్సీ 98, 2008, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగోన్నతులు చేపట్టాలని, ఆదర్శ పాఠశాలల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి



ఓబుళదేవరచెరువు, జూలై 15: విద్యుదాఘాతానికి ఓ దూడ మరణించింది. మండలంలోని ఇగనలూరు గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి పొలంలో ఆదివారం రాత్రి వీచిన భారీ గాలులకు విద్యుత్ స్తంభం విరిగింది. దీంతో తీగలు నేలపై పడ్డాయి. సోమవారం ఆ పొలం లోకి మేత కోసం వెళ్లిన వాసుదేవరెడ్డికి చెందిన ఓ దూడ ఆ తీగలను తగలడంతో విద్యుదాఘాతానికి అది అక్కడికక్కడే మరణించింది.

కుక్కల దాడిలో 40 గొర్రెపిల్లలు ..

ధర్మవరం రూరల్, జూలై 15: మండలంలోని రావులచెరువు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కుక్కలదాడిలో 40 గొర్రెపిల్లలు చనిపోయాయి. గొర్రెల కాపరులు బాలగొండ్ల నారాయణస్వామి, సుధాకర్, వెంకటనారాయణ గ్రామ సమీపంలోని గూడు కింద గొర్రె పిల్లలను ఆదివారం సాయంత్రం వదిలేసి ... తోటల వద్ద ఉన్న గొర్రెల మంద వద్దకు వెళ్లారు. తిరిగి సోమవారం తెల్లవారజామున గొర్రెపిల్లల గూడు తెరవగా పిల్లలన్నీ రక్తపుమరకలతో చెల్లాచెదురుగా పడి మరణించి ఉండటాన్ని గుర్తించారు. కుక్కలు దాడి చేసి చంపేసినట్లు గుర్తించారు. దీంతో తమకు సుమారు 3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. విషయం తెలిసిన ఏన్డీఏ కూటమి గ్రామ నాయకుడు చెన్నారెడ్డి అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించారు.



గొర్రెపిల్లల కళేబరాలు

22 నుంచి క్రికెట్, కబడ్డీ పోటీలు

ధర్మవరం, జూలై 15: పట్టణంలోని తారక రామాపురం ఆర్డీటీ క్రీడామైదానంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 20వతేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99859 29285, 99664 92540 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం, జూలై 15: నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి చంపేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని బహుజన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ధర్మవరంలో మాట్లాడుతూ.. తక్షణమే పోలీసులు నిందితులను అరెస్టు చేయాలన్నారు.

రేపు కొండకమర్లలో జలధి

ఓబుళదేవరచెరువు, జూలై 15: మండలంలోని కొండకమర్ల పంచాయతీలో బుధవారం జలధి గురువారం ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాకులు జౌలి బాబు, జౌలి అబ్లు, మహేష్, చెన్న, మహమూబ్‌బాషా, గ్యాస్ అబ్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆటస్థలం అభివృద్ధికి సహకరించండి

ముదిగుబ్బ, జూలై 15: స్థానిక వడ్డిపేట పాఠశాలలో ఆటస్థలం అభివృద్ధికి దాతలు సహకరించాలని పాఠశాల ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ పాఠశాలలో 130 మంది విద్యార్థులు ఉన్నారని, వారు ఆడుకోవడానికి సరైన మైదానం లేదని అన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు సామాజిక వేత్త గడ్డం రాజగోపాల్ దృష్టికి తీసుకొనివెళ్లగా.. సుమారు రూ. రెండు లక్షలు ఖర్చు చేసి గుట్టను కొంతమేర చదును చేయించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. నలుగురు ఉపాధ్యాయులు కూడా రూ. 20 వేలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఇంకా గుట్ట ప్రాంతమంతా చదును చేయాల్సి ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక వేత్తలు స్పందించి ఆట స్థలాన్ని చదును చేయించడానికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా మొహరం

నంబులపూలకుంట, జూలై 15: మండల కేంద్రంలోని మొహరం వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. పీర్ల చావిడితో పీర్లను కొలువుదీర్చారు. ధనియాన్‌చెరువు, పెడబల్లి, అరవవాండ్లపల్లి, ఎన్పీకుంట గ్రామాల్లో చావిడల్లో పీర్లు కొలువు తీరాయి.

ఆర్టీసీ బస్సుకు ప్రమాదం

ధర్మవరం, జూలై 15: తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బురెడ్డిపల్లి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ధర్మవరం ఆర్టీసీ బస్సు మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో 15 మంది దాకా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి.. కొందరిని అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రమాదం గురించి ఆరా తీశారు.

18న తొలి ఏకాదశికి ఎడ్లబండ్ల పోటీలు

కొత్తచెరువు, జూలై 15: తొలిఏకాదశి సందర్భంగా కొత్తచెరువులో పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఎడ్లబండ్ల పోటీలను గురువారం నిర్వహిస్తున్నట్లు హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి రహదారిలో వెలిసిన వెంకటేశ్వస్వామికి బుధవారం ఏకాదశి రోజు ఉపవాసం ఉన్న భక్తులు పూజలు నిర్వహిస్తారు. అనంతరం గురువారం ఎడ్లబండ్ల పోటీలను నిర్వహిస్తారు. బుక్కపట్నం రహదారిలోని సంఘమేశ్వర శివాలయంలో పూజలు నిర్వహించడంతో ఎడ్లపోటీలు ముగుస్తాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ముదిగుబ్బ, జూలై 15: బాధితుల కుటుంబాలను ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సోమవారం పరామర్శించారు. మండలంలోని దొరిగల్లు క్వాటర్స్‌లో టీడీపీ కార్యకర్త రమేష్ అనారోగ్యంతో మరణించాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త మేకల సూరి అనారోగ్యంతో మరణించాడు. వీరి కుటుంబాలను ఆదినారాయణ యాదవ్ సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గణపర్తి రమేష్, కృష్ణమూర్తి యాదవ్, చిన్నకోట్ల రాజా, కూడేరు రాము, సూరి, శివయ్య, తిరుమలేష్, రాములు పాల్గొన్నారు.

చెన్నై బస్సును పునరుద్ధరించండి

పుట్టపర్తి, జూలై 15: దశాబ్దాలుగా పుట్టపర్తి, చెన్నైల మధ్య నడుస్తున్న బస్సును అర్ధాంతరంగా నిలిపివేశారని, దాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజారవాణా ఉద్యోగులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని కోరారు. సోమవారం ఎన్ఎంయూ నాయకులు శంకర్, షబ్బీర్, తిరుపతమ్మ, చంద్రాయుడు, శివశంకర్, విజయలక్ష్మి, నూర్‌మహమ్మద్ అనంతపురం వెళ్లి ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి.. వినతిపత్రం అందజేశారు. డిపో లోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని ఘనంగా సన్మానించారు.

రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

కదిరిఅర్బన్, జూలై 15: కదిరి నుంచి గోరంట్ల రోడ్డు విస్తర్ణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా చైర్మన్ కదిరప్ప తెలిపారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కదిరి నుంచి గోరంట్ల వరకు నాలుగులైన్ల రోడ్డు విస్తర్ణ పనులు ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాలేదన్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. దీంతో ప్రయాణీకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలువడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నిత్యం సిమెంటు లారీలు వందలాదిగా వెళ్తుండటంతో రోడ్డు మరీ అధ్వానంగా మారిందన్నారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

కదిరిలీగల్, జూలై 15: అతివేగం అనర్థదాయకమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని స్థానిక బాలుర కళాశాల ప్రిన్సిపాల్ హరేంద్రప్రసాద్ విద్యార్థులకు సూచించారు. హెల్మెట్ ధారణ, మోటారు వాహనాల చట్టం తదితర అంశాలపై ఆ కళాశాలలో సోమవారం మండల న్యాయ అధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో న్యాయవాది లింగాల లోకేశ్వర్‌రెడ్డి, లెక్చరర్లు దామోదర్, రమణ పాల్గొన్నారు.

ధర్మవరం: మోటార్ వాహన చట్టాలు, ట్రాఫిక్ రూల్స్‌పై స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయవాది బాలసుందరి, ట్రాఫిక్ కానిస్టేబుల్ నారాయణస్వామి సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిమయ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



కదిరి సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హరేంద్రప్రసాద్


వైసీపీ నాయకులకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిరటౌన్/అగళి, జూలై 15: రాష్ట్రాభివృద్ధిని పరుగులు పెట్టించే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని అందరూ విశ్వసిస్తున్నారని, అందుకే టీడీపీలోకి వలసలు పెరిగాయని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం మడకశిర పట్టణంలోని ఆర్అండ్బీ అతిథిగృహంలో అగళి మండలం రామనపల్లి, కురుసాంగనపల్లి, రొళ్ల మండలం రత్నగిరి గొల్లహట్టి గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. గుండుమల తిప్పేస్వామి వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామనపల్లి గ్రామానికి చెందిన వైసీపీ వార్డు మెంబర్ మహదేవప్పతోపాటు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. రత్నగిరి గొల్లహట్టికి చెందిన చిత్తప్ప, నాగన్న, కరియన్న, బడప్ప, తమ్మన్న, సన్ననాగప్ప, ఎలే చిత్తప్ప, దొడ్డన్నతో కలిసి దాదాపు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మండల కన్వీనర్ దాసిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే

మడకశిర, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. సోమవారం మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కావల్సిన వన్‌బీ అడంగళ్ తదితర సర్టిఫికెట్లను తక్షణమే జారీ చేయాలన్నారు. అనంతరం పాఠశాలల విలీనంపై ఎంఈఓ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, వ్యవసాయ అధికారి తిమ్మప్ప, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోండి: ఏఓ


మంజునాథ్, ఏఓ

మడకశిర(అమరాపురం), జూలై 15: కౌలు రైతులు గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని ఏఓ తెలిపారు. అమరాపురం మండలంలోని భూమిలేని రైతులు, ఇతరుల భూమి కౌలుకు చేస్తున్నవారు ఈసేవా కేంద్రానికి వెళ్లి గుర్తింపుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన కౌలు రైతులకు ప్రభుత్వం పంటసాగు హక్కుపత్రం, సీసీఆర్సీ కార్డులు అందజేస్తామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతుకు కూడా అందుతాయన్నారు. కౌలు రైతులు ఈసేవా కేంద్రాలకు వెళ్లి భూమి యజమాని ఆధార్‌కార్డు, భూమి పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు, అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో నైపుణ్య దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యనారాయణ

గోరంట్ల, జూలై 15: ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పట్టణంలోని ఏఎన్‌కే డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కళాశాలకు స్కిల్ డెవలప్‌మెంటు కేటాయించడం హర్షణీయమన్నారు. ఎస్ఏపీఎస్, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ అడవాల సూర్యనారాయణ మాట్లాడుతూ.. జీవితంలో అత్యంత ఉన్నతస్థాయికి ఎదిగిన వ్యక్తులు అతి సామాన్య కుటుంబాల నుంచి వచ్చినవారే అన్నారు. నైపుణ్యం సాధించినవారే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగమణి, సుధాకర్, రాజేంద్ర, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


బ్యాగులను చూపుతున్న విద్యార్థులు

హిందూపురం(పరిగి), జూలై 15: పాఠశాలలకు సకల సౌకర్యాలు కల్పించడమే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని, విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయులు పిలుపునిచ్చారు. పరిగి మండల పరిధి కాలువపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం టీడీపీ నాయకులు విద్యార్థులకు బ్యాగులు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ చదువుకోవాలన్న ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు తల్లికి వందనం ప్రవేశపెట్టారని, విద్యార్థులందరికీ రూ.15వేలు త్వరలో అందజేస్తారన్నారు. కార్యక్రమంలో బీరప్ప, రంగనాథ్, కోటప్ప, మనోహర్, రవీంద్ర, బాలు, వీరభద్రప్ప, శ్రీధర్ పాల్గొన్నారు.

వీరవనిత దుర్గాబాయి దేశ్‌ముఖ్

హిందూపురం అర్బన్, జూలై 15: స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘసంస్కర్త, వీరవనిత దుర్గాబాయి దేశ్‌ముఖ్ అని ఎంఈఓ గంగప్ప కొనియాడారు. సోమవారం స్థానిక ఎంజీఎం ఆవరణలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాఠశాలలో ఆమె జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. దుర్గాభాయ్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, బ్రిటీష్ సైన్యాన్ని వీరోచితంగా ఎదుర్కొన్నారన్నారు. హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు శంకర్, విజయలక్ష్మి, లలిత, సుమతి, లక్ష్మి, ప్రసన్న, శ్రావణి పాల్గొన్నారు.

ఐఐఐటీకి గుట్టూరు విద్యార్థి ఎంపిక


నరేష్

పెనుకొండ రూరల్, జూలై 15: మండలంలోని గుట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నరేష్ ఐఐఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం నాగార్జునుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టూరు గ్రామానికి చెందిన నరేష్ 2023-24 విద్యాసం వత్సరంలో 10వ తరగతిలో 568మార్కులు సాధించాడన్నారు. నరేష్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఇంటి దొంగలు..!

- టిడ్కో ఇళ్లలో దొంగలు పడ్డారు..
- రూ.కోట్ల వస్తువులు మాయం
- సెక్యూరిటీని తప్పించారు..
- ఎమ్మెల్యే బాలకృష్ణ పరిశీలనతో బయటపడ్డ నిజాలు

హిందూపురం, జూలై 15: పట్టణంలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి కొటిపి సమీపంలో టిడ్కో ఇళ్లను టీడీపీ హయాంలో నిర్మించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను పూర్తి చేయకుండా ఎక్కడివక్కడ నిలిపివేశారు. దీంతో గత ఐదేళ్లుగా టిడ్కో ఇళ్లు మొండిగోడల్లా నిలిచిపోయాయి. కొటిపి వద్ద సుమారు 200కుపైగా గృహాల్లో సుమారు రూ.కోటి విలువచేసే వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తేలడంతో అందరూ అవాక్కయిపోతున్నారు.


గుంటూరు సెల్పులు ఎత్తుకెళ్లిన ప్రాంతాన్ని చూపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

రూ.కోటి వస్తువులు దోచుకెళ్లారు..

కొటిపి వద్ద ఒక బ్లాక్‌కు 48ఇళ్లు చొప్పున 25బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. అయితే 2019ఎన్నికలకు ముందు నాలుగు బ్లాక్‌లలో పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రయత్నం చేసింది. ప్రభుత్వం మారడంతో వైసీపీ టిడ్కో ఇళ్లను పట్టించుకోకుండా మూలనపడేసింది. దీంతో ఇళ్లకు తలుపులు, కిటికీలు, గుంటూరు సెల్పులు, మరుగుదొడ్లలో బేసిన్లతో పాటు ప్లాస్టిక్‌పైపులు, గ్యాస్‌పైపులు ఎత్తుకెళ్లారు. ఒక్కో ఇంటికి చోరీ చేసిన వస్తువులు సుమారు రూ.20వేల నుంచి రూ.30వేలు విలువచేసేవని అధికారులుపేర్కొంటున్నారు. ఈ లెక్కన రూ.40లక్షల నుంచి రూ.50లక్షలదాకా విలువచేసే వస్తువులు ఎత్తుకెళ్లారన్నారు. దీంతోపాటు టన్నుల కొద్దీ ఉన్న ఐరన్ కూడా తీసుకెళ్లారు. దీనివిలువ రూ.కోటిదాకా ఉంటుందని అధికారుల అంచనా. నిర్మాణం కోసం ఆ ప్రాంతంలో నిలువచేసిన వస్తువులు, పరికరాలు సైతం ఎత్తుకెళ్లారు.

సెక్యూరిటీని తొలగించిన నిర్మాణ సంస్థ

ఇదిలా ఉండగా కొటిపివద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టే కంపెనీవారు అప్పట్లో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ఇళ్లకు సంబంధించినబిల్లులు మంజూరు చేయకపోవడం వాటిని గాలికి వదిలేయడంతో నిర్మాణ సంస్థ కూడా చేసేదిలేక కొన్ని నెలలపాటు చూసి అక్కడ కాపలా పెట్టిన సెక్యూరిటీ గార్డ్‌లను కూడా తొలగించేశారు. ఈ పరిస్థితుల్లో టిడ్కో ఇళ్లకు అడిగేవారులేకుండా పోయారు. దీంతో కొంతమంది వైసీపీ నాయకుల అండతో అప్పట్లో యథేచ్ఛగా దోచుకెళ్లారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే కొన్ని వస్తువులను వైసీపీ నాయకులు ఎత్తుకెళ్లి వాటిని మార్చుకుని ఇంటి నిర్మాణానికి ఉపయోగించుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా సెక్యూరిటీ గార్డ్‌లు లేకపోవడంతో టిడ్కో ఇళ్లలో దొంగలు యథేచ్ఛగా ఎత్తుకెళ్లారు.

పోలీసులకు ఫిర్యాదు లేదు

టిడ్కో ఇళ్లలో ఇంతపెద్దఎత్తున చోరీ జరిగినా నెలలపాటు వాటిని ఎత్తుకెళ్లినా సంబంధిత శాఖ అప్పట్లో మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. అధికారులకు తెలిసినా అధికార పార్టీ నాయకులున్నారని ఫిర్యాదు చేయడానికి జంకినట్లు సమాచారం.

ఎమ్మెల్యే పరిశీలనతో..

టిడ్కో ఇళ్లలో దొంగలుపడి దోచుకెళ్లారన్న విషయం ఆదివారం వరకు బయటి వ్యక్తులకు తెలియదు. సంబంధిత అధికారులు కూడా గమనించలేదు. కానీ ఆదివారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కోఇళ్ల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పరిశీలించిన గదుల్లోనే గోడలు ధ్వంసం చేసి గుంటూరు సెల్పులు, తలుపులు, మరుగుదొడ్ల బేసన్‌సెట్లు ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్లలో జరిగిన చోరీలపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.


ధ్వంసమైన గది

రూ.50లక్షలు ఉండవచ్చు : శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్

కొటిపి వద్ద టిడ్కో ఇళ్లకు సంబంధించి నాలుగు బ్లాక్‌లలో సుమారు 200ఇళ్లకు సంబంధించి కొన్నివస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఒక్కో ఇంటికి రూ.25వేల దాకా విలువ ఉంటుందన్నారు. ఈ లెక్కన సుమారు రూ.50లక్షలు విలువచేసే వస్తువులు ఎత్తుకెళ్లారు.


పడిపోయిన గోడలు

గౌరవప్రదమైనది.. ఉపాధ్యాయ వృత్తి

సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

మడకశిరటౌన్, జూలై 15: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. తాను ఎన్టీ రామారావు ఇంటర్మీడియట్‌కు ఉపాధ్యాయ పోస్టులు వదిలిన సమయంలో ఎంపికయ్యానని, అయినా ఉన్నత చదువుల కోసం ఉపాధ్యాయ వృత్తిలో చేరలేకపోయానన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా కోచింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని అత్యధిక మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో అత్యధికంగా విజయం సాధించాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకాన్ని మెగా డీఎస్సీపై చేశారన్నారు. వెనకబడిన మడకశిర ప్రాంత అభ్యర్థుల సౌకర్యార్థమే కోచింగ్ ప్రారంభించామన్నారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తదితరులు ఉన్నారు. కోచింగ్‌కు చుట్టుపక్కల ప్రాంతాల అభ్యర్థులు పలువురు హాజరయ్యారు.


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్


దోమల మందును చల్లుతున్న ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు

కోనాపురంలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ రూరల్, జూలై 15: నగర పంచాయతీ కోనాపురం గ్రామంలో ఎట్టకేలకు పంచాయతీ, వైద్యసిబ్బంది శుభ్రతా పనులుచేపట్టారు. 'నగర పంచాయతీ గ్రామాల్లో అభివృద్ధి శూన్యం' అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. చౌడేశ్వరి, సచివాలయ ఏఎన్ఎం నందిని గ్రామానికి చేరుకుని కోనాపురంలో అపరిశుభ్రంగా ఉన్న బురదనీరు, చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. వాటిపై బ్లీచింగ్ చల్లించారు. దోమలు వృద్ధి కాకుండా ఆయిల్‌బాల్స్ మందును పిచికారి చేశారు.

చిరుత దాడిలో మేక మృతి

మడకశిర రూరల్, జూలై 15: మండలంలోని మెళవాయి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో సోమవారం సాయంత్రం మేకల మందపై చిరుత దాడిచేసింది. అందులో ఒక మేక మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మెళవాయి గ్రామానికి చెందిన హనుమంతప్పకు 20 మేకలు ఉన్నాయి. మేత కోసం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలోకి వెళ్లారు.సాయంత్రం మేకలతో ఇంటికి వస్తుండగా కొండలో ఉన్న చిరుత ఒక్కసారిగా మేకల మందపై దాడిచేసినట్లు తెలిపారు. మందు ఒక మేకను చిరుత చంపేసింది. సమీపంలోని రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు కొండ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందని, అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. చనిపోయిన మేక రూ.20 వేలు ఉంటుందని రైతు తెలిపారు. అధికారులు త్వరగా బోను ఏర్పాటు చేసి చిరతను బంధించాలని వారు కోరారు.


మేక కళేబరం

శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించండి

పావగడ, జూలై 15: తాలూకా పరిధిలోని టీఎన్‌పేట గ్రామంసర్వేనంబరు 422లో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని సోమవారం ఆ గ్రామస్థులు తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు. దాదాపు 60సంవత్సరాల నుంచి స్మశానవాటికను అన్ని మతాలవారికి ఉపయోగించుకుంటున్నారని అయితే ఇటీవల కొందరు శ్మశానం పక్కనే భూములు కొనాలని ప్రయత్నిస్తున్నారని, దానిని అడ్డుకోవాలని కోరారు. గ్రామస్థులు నారప్ప, రమేష్, నరసింహప్ప, రామప్ప, నారాయణప్ప వినతిపత్రం అందించినవారిలోఉన్నారు.


తమసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌పేట గ్రామస్థులు

మొహర్రం వేడుకలు


అలంకరణలో పీర్లు

రొళ్ల, జూలై 15: మండల కేంద్రంలోని పురాతన చారిత్రాత్మక, ఆధ్యాత్మిక క్షేత్రమైన రత్నగిరిలో మొహరం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అగ్నిగుండం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలోని అన్ని గ్రామాల భక్తులు తరలి రానున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

గుడిబండ, జూలై 15: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ట్యాంకు, డ్రైనేజీ, చెత్తాచెదారాన్ని తొలగించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శులు ప్రకాశ్, అమరేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పచ్చదనంతో ఆహ్లాదం: తహసీల్దార్

హిందూపురం (సోమందేపల్లి), జూలై 15 : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం తహసీల్దార్ అంజనాదేవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చదనం పెంపొందించడం ద్వారా పరిసరాలు ఆహ్లాదకరంగా మారుతాయన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద, స్థలాల్లో మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న తహసీల్దార్

అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 15: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లపై సోమవారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 4న ప్రతియేటా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొగటవీర క్షత్రియుల ఆరాధ్యదైవమైన అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయడానికి అందరూ కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో పూజారి ఈశ్వరయ్య, రంగన్న, ప్రసాద్, నిమ్మకాయల రామాంజి, అశోక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన

పెనుకొండ, జూలై 15: ఏపీసీపీఎస్ఈ పెనుకొండ జోన్ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దుచేయకుండా జీపీఎస్ గెజిట్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గెజిట్ కాపీలను తగలబెట్టారు. గత ప్రభుత్వానికి కొనసాగింపుగా జీపీఎస్ గెజిట్‌ను ఈ ప్రభుత్వం విడుదల చేయడంతో సీపీఎస్ ఉద్యోగుల ఆశలు అడియాశలయ్యాయని వారు ఆవేదన్య వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ మల్లికార్జున, రంగేష్‌కుమార్, ఆంజనేయులు, వెంకటరమణ నాయక్, చంద్రమౌళి, సబ్బరాయప్ప, చంద్ర, వెంకటేష్, మల్లికార్జున, శ్రీనివాసులు, సోమశేఖర్, రఘునాథ్, సంజీవ్, సురేంద్ర, ఓబులేసు, నరేంద్రరెడ్డి, జహీర్, సురేందర్‌రెడ్డి, ట్రెజరీ శాఖ జగన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి విషయంలో ఘర్షణ

- ఒకరికి గాయాలు ● 12 మందిపై కేసు

గోరంట్ల, జూలై 15: వర్షపునీటి విషయంలో జరిగిన ఘర్షణలో 12 మందిపై కేసు నమోదయ్యింది. మండలంలోని బూచేపల్లికొత్తపల్లిలో వర్షపు నీటి దొనె విషయంలో రెండు కుటుంబాల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. గ్రామంలో గట్టు జనార్ధన్‌రెడ్డి, గోవిందప్ప ఇళ్లు ఎదురెదురుగా ఉన్నాయి. వర్షం కురుస్తుండడంతో జనార్ధనరెడ్డి ఇంటిపై అమర్చిన దోనె పైపు నుంచి నీరు రోడ్డుపై పడుతోంది. వర్షపునీటి కారణంగా ఇంటి ప్రహరీ దెబ్బ తింటుందని గోవిందప్ప జనార్ధన్‌రెడ్డితో గొడవపడ్డారు. దీంతో ఇరు కుటుంబాల సభ్యులు గొడవకు దిగారు. గోవిందప్ప కత్తితో జనార్ధన్‌రెడ్డి వీపైపు గాయపరిచారు. గాయపడిన జనార్ధన్‌రెడ్డి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. జనార్ధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గోవిందప్ప కుటుంబ సభ్యులు పాపులమ్మ, శారదపై కేసు నమోదుచేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పాత కక్షల కారణంగా జనార్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తమ ఇంట్లోకి దౌర్జన్యంగా దూరి దాడి చేసినట్లు పావులమ్మ ఫిర్యాదు చేసింది. జనార్ధన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వసుంధర, గీత, శాంతమ్మ, సుదీర్, గోవిందురెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, జూలై 15: పండ్లతోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ శ్రీకాంత్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలలోపు భూములు ఉన్న సన్న,చిన్న కారుల రైతులు పండ్ల తోట పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. డ్రైలాండ్ హార్టికల్చర్ ద్వారా మామిడి, కొబ్బరి, చింత, జామ అల్లనేరేడు, దానిమ్మ రోజా, మల్లెపూలు తోటలు పెంపకానికి మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, జిరాక్స్ కాపీలు జతపరచాలన్నారు. మూడేళ్లపాటు మొక్కల సంరక్షణకు బిల్లులు చెల్లిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు కూరగాయల సంత వేలం

గోరంట్ల, జూలై 15: వాయిదాపడిన కూరగాయాల సంత మార్కెట్ గదుల వేలం మంగళవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యనిర్వాహణాధికారి బాబురావు తెలిపారు. గత శుక్రవారం కూరగాయాల సంత వేలం నిర్వహించగా 14మంది డిపాజిట్లు కట్టినా, వేలం పాడడానికి ఆసక్తి చూపించకపోవడంతో డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డివేలం వాయిదా వేసిన సంగతి తెలిసింది. పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే వేలాల్లో ఆసక్తి గలిగినవారు ధరావతు చెల్లించి, పాల్గొన్నాలని కోరారు

23న ప్రజావేదిక

హిందూపురం(సోమందేపల్లి), జూలై 15: మండలంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ఈనెల 23న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలో చేపట్టబోయే సామాజిక తనిఖీ 14నుంచి 22వరకు పంచాయతీలవారీగా జరుగుతుందన్నారు. 16పంచాయతీల్లో డీఆర్పీలు తనిఖీలు చేపట్టి గ్రామ సభలను నిర్వహిస్తారన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉదయం 10గంటలకు ప్రజావేదిక ద్వారా తనిఖీ వివరాలు వెల్లడించడం జరుగుతుందన్నారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

హిందూపురం అర్బన్, జూలై 15: గురుపౌర్ణమి వేడుకలకు బాబా ఆలయాలు సిద్ధమవుతున్నాయి. హిందూపురం నానెప్పనగర్‌లోని ప్రధాన షిరిడీ దేవాలయం, నారాయణప్పవీధి, సత్యనారాయణపేట, కొటిపి, న్యూ హస్నాబాద్, హౌసింగ్‌బోర్డులో, కొడిగెనహళ్లి, మోదా తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నానెప్పగనర్‌లోని ఆలయంలో 21వ తేదీ ఉదయం 5 గంటలకు కాగడహారతి, 6.30 గంటలకు అభిషేకం, 9గంటలకు మహా గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు, విష్ణుసహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, 12.30 పూర్ణాహుతి, ఒంటి గంటకు మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 6.30 గంటలకు సాయం సంధ్యా హారతి, 7 గంటలకు ప్రాకారోత్సవం, పూలపల్లకిసేవ, ధ్వజారోహణము, 7.30 గంలకు ప్రసాద వినియోగం, రాత్రి 10 గంటలకు శేజహారతి, పాన్పుసేవ ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై బాబా కృపకు పాత్రులు కావాలని అఖండ సాయియినాథ్ సప్తాహ కమిటీ సభ్యులు తెలిపారు.

చదువుకు చేయూత

హిందూపురం అర్బన్, జూలై 15: పట్టణ పరిధిలోని చిన్నమార్కెట్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చేయూత సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేశారు. కళాశాలలో విద్యార్థులకు 1800 నోటు పుస్తకాలు వితరణగా అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు గూడూరు రమేష్, ఉపాధ్యక్షురాలు గూడూరు అరుణ, మదర్స్‌హగ్ ఆసుపత్రి, ఉమెన్‌చైల్డ్‌కేర్, మెడ్‌సన్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానిల్లో కెల్లా విద్యా దానం గొప్పదని, విద్యతో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లితండ్రులకు, కళాశాలకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, డా. నిఖిల, డా. భానుతేజ, అధ్యాపకులులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


ఆదిశేషు (ఫైల్)

హిందూపురం(పరిగి), జూలై 15: పరిగి మండల కేంద్రంలో మడకశిర బస్టాండు సమీపంలో నాయీబ్రాహ్మణుడు ఆదిశేషు(43) గుండెపోటుతో మృతి చెందాడు. సెలూన్ షాపులో పనులు చేసుకుంటూ సోమవారం మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నీ తానై పోషించేవాడనీ, ఇప్పుడు తమకు దిక్కెవరని కుటుంబ సభ్యులు రోదించారు. అతడికి భార్య అరుణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనారోగ్య సమస్యలు లేకున్నా గుండెపోటుతో మృతిచెందాడని తోటి దుకాణదారులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సందడి

- జీఓ 596రద్దు అంటూ వదంతులు

పెనుకొండ టౌన్, జూలై 15: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సోమవారం సందడిగా కనిపించింది. అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ జీఓ 596ను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ జీఓను రద్దు చేస్తుందన్న వదంతులు మూడు రోజులుగా ఊపందుకున్నాయి. దీంతో కొంతమంది రైతులు, రియల్టర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పరుగులు పెట్టారు. 20ఏళ్ల కాలపరిమితి దాటిన అసైన్డ్ భూముల్లో నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆ రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని 2023డిసెంబరులో రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కూటమి అధికారంలోకి రాగానే పేదల భూములు పెద్దల చేతులు మారుతాయని నివేదికలు రావడంతో ఈ జీఓను రద్దుచేయాలా, నిబంధనలు విధించాలా అన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ జీఓ ప్రకారం రైతుల నుంచి అగ్రిమెంట్‌లు చేసుకున్న రియల్టర్లు సబ్‌రిజిస్టర్ కార్యాలయానికి బారులు తీరుతున్నారు. అధికారులు రిజిస్ట్రేషన్ చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్‌కు లక్షల్లో చలానా కట్టాల్సి వస్తుందని, మార్పులతో కూడిన జీఓ వెంటనే వస్తే ఆ నగదు వెనక్కురాదనీ, తామేమీ చేయలేమని అధికారులు అంటున్నారు. అయినా చేయాల్సిందేనని రియల్టర్లు ఒత్తిడి తెస్తున్నారు. ఏది ఏమైనా జీఓ 596 రద్దు సర్వత్రా చర్చనీయాంశమైంది.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన జనం